క్లుప్తంగా

ఘనంగా ముత్యాలమ్మ తీర్థం


మురమండలోని ముత్యాలమ్మ

కడియం: మురమండలోని ముత్యాలమ్మ తీర్థమహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఏటా ముక్కనుమ రోజు అమ్మవారి తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. కడియం మండలంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా.. సోమవారం రాత్రి అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే పార్థసారథికి పరామర్శ


పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథిని పరామర్శిస్తున్న యాదవ ప్రముఖులు

రాజమహేంద్రవరం రూరల్: పితృవియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని యాదవ ప్రముఖులు పరామర్శించారు. మంగళవారం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఆయన తండ్రి, మాజీ ఎంపీ కేపీ రెడ్డియ్య యాదవ్ అస్థికలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథిని యాదవ ప్రముఖులు, వైఎస్సార్ సీపీ నాయకులు చవల సూర్యచంద్రరావు, అంకం గోపీ, గోకుల్ నర్సరీ మూర్తి యాదవ్, నౌడగల సుధా యాదవ్, బర్ల సత్యనారాయణ, కందిరెల్లి సత్తిబాబు పరామర్శించారు.

పూర్ణచంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయం


గొందేశి పూర్ణచంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ కమిటీ మాజీ చైర్మన్, మాజీ కౌన్సిలర్ గొందేశి పూర్ణచంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్మన్, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి తన తండ్రి పూర్ణచంద్రారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ సభ్యుడు ముద్దాల అను, హితకారిణి సమాజం డైరెక్టర్ సరిత రాణి, తాడాల విష్ణు చక్రవర్తి, సూరంపూడి ప్రకాష్ చరణ్, కళ్యాణి రెడ్డి, న్యాయవాది సుమన్ పాల్, సునీల్, సురేంద్ర పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

రాజానగరం: స్థానిక మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు జరగనుంది. కార్యాలయ మీటింగ్ హాలులో ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలని ఎంపీడీఓ బి.రామారావు సూచించారు. ప్రజాప్రతినిధులు తప్పని సరిగా పాల్గొని స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

ఆత్మహత్యాయత్నం

సీతానగరం: చినకొండేపూడికి చెందిన 28 ఏళ్ల కేతమళ్ల రాజు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా సోమవారం రాత్రి కేసు నమోదు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్న రాజు అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమించాడు. అయితే రాజును ఆమె అన్నయ్య నిలదీయడంతో మనస్తాపం చెంది ఈ నెల 15న ఇంటివద్ద ఉన్న గడ్డి మందు తాగాడు. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టును ఢీకొని వ్యక్తి మృతి

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో కొల్లి బుజ్జిదొర (33) చెట్టును ఢీకొని ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. రంగంపేట మండలం వడిశలేరు గ్రామానికి చెందిన బుజ్జిదొర సంక్రాంతి పండగ సందర్భంగా బావమరిది ఇంటికి శ్రీరంగపట్నం వచ్చాడు. ఈ నేపథ్యంలో మోటారుసైకిల్‌పై వెళుతూ చెరువు గట్టు పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

క్రిస్టియన్ అసోసియేషన్ సమావేశం

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల రెవరెండ్ రమేష్ చర్చిలో మంగళవారం యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు రెవరెండ్ చిర్రా ప్రసాద్ మాట్లాడుతూ పాస్టర్లు క్రీస్తు బోధనలను విస్తృతం చేయాలన్నారు. కార్యదర్శి పీజే రాజు, కె.అబ్రహాం, డి.రాజు పాల్గొన్నారు.

టాటూ పిక్చర్.. నయా కల్చర్

- యువతలో పెరుగుతున్న ఆసక్తి
- ఆకట్టుకుంటున్న డిజైన్లు
- అందుబాటులో నచ్చిన రంగులు


టాటూ వేస్తున్న నిర్వాహకుడు ఏడుకొండలు








రాజమహేంద్రవరం రూరల్: ప్రస్తుతం యువతలో టాటూ క్రేజ్ నడుస్తోంది. ఒంటిపై నచ్చిన డిజైన్ వేయించుకుని నలుగురిలో ప్రత్యేక ఆకర్షణగా ఉండాలని కోరుకుంటున్నారు. నగరాల నుంచి చిన్న పట్టణాలు, గ్రామాలకు ఈ కల్చర్ పాకడంతో చాలామంది వీటిపై ఆసక్తి చూపుతున్నారు. కొందరు కేవలం రెండు లేదా మూడు రోజులు మాత్రమే ఒంటిపై డిజైన్ కావాలని, మరి కొందరు శాశ్వతంగా ఉండిపోవాలని నిర్వాహకులకు ముందే చెబుతున్నారు. మార్కెట్లో టాటూలకు డిమాండ్ పెరుగుతుండడంతో పలువురు ఔత్సాహికులు స్థానికంగా సెంటర్లను ప్రారంభించి ఉపాధి పొందుతున్నారు.

విపరీతమైన క్రేజ్

ప్రస్తుతం టాటూ ట్రెండ్‌గా మారింది. నాడు పచ్చబొట్టు నేడు టాటూ పేరేదైనా నేటి యువతలో మాత్రం దీనిపై విపరీతమైన క్రేజ్ వచ్చింది. పెళ్లి, యూత్ పార్టీలు, పండగలు, గెట్ టుగెదర్.. సందర్భం ఏదైనా ఒంటిపై టాటూ పడాల్సిందే. సెలబ్రిటీల నుంచి సామాన్యుల వరకు వైవిధ్యంగా కనిపించాలని శరీరమంతా డిజైన్ చేయించుకుంటున్నారు. తమకు నచ్చినవారి పేర్లు, దేవుళ్లు, అభిమాన హీరోలు, కొటేషన్లు, కార్లు, బైక్లు ఇలా మనసుకు నచ్చిన వాటిని టాటూగా ఎంచుకుంటున్నారు. కొందరు స్టైల్ కోసం మరికొందరు ప్రేమను వ్యక్తపరిచేందుకు ఆసక్తి చూపుతున్నారు.

అందుబాటులో డిజైన్లు

ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టు రియల్ స్టిక్, గ్రేవాష్, పోట్రేట్, 3డి తదితర టాటూ డిజైన్లు అందుబాటులోకి వచ్చాయి. సింపుల్ టాటూ నుంచి రకరకాల బొమ్మల టాటూలు, నార్మల్, పర్మనెంట్ ఇలా అనేక విధాలుగా వస్తుండటంతో టాటూ లవర్స్ ఫిదా అవుతున్నారు. గతంలో డిజైనర్లు టాటూ కోసం పచ్చరంగు మాత్రమే ఉపయోగించగా, ఇప్పుడు అనేక రకాల రంగులను వినియోగించి ఆకట్టుకుంటున్నారు. మల్టీకలర్స్‌తో చిరకాలం గుర్తుండేలా వేసుకోవడం ఎంతో క్రేజ్‌గా మారింది. ఇలా ఎంచుకున్న డిజైన్‌ను బట్టి రూ.వెయ్యి నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు.

ఫ్యాషన్‌గా ఉండడం ఇష్టం



ఫ్యాషన్‌గా ఉండటమంటే నాకిష్టం. అందుకు తగ్గట్టుగా టాటూ వేయించుకున్నాను. నా ఒంటిపై 20 టాటూలు ఉన్నాయి. నా చేతిపై అమ్మ, అన్నయ్య ఫొటోలు టాటూగా వేయించుకున్నా అది నాకెంతో ప్రత్యేకం. గతంలో టాటూ గ్రీన్‌కలర్‌లో అందుబాటులో ఉండేవి. ఇప్పుడు వివిధ రకాల రంగులు మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చాయి.

– సుధీర్, బొమ్మూరు

క్రేజ్ పెరిగింది



నేను చిన్నప్పటి నుంచి ఆర్టిస్టుని. హైదరాబాద్‌లో టాటూ ఆర్ట్ నేర్చుకున్నాను. ఎనిమిదేళ్ల క్రితం రాజమహేంద్రవరంలో టాటూ షాపును ప్రారంభించాను. టాటూ ఆర్ట్‌ను వేయడంతో పాటు తీసేసే విధానాన్ని ఉపయోగిస్తున్నాం. డిజైన్‌ను బట్టి రూ.1000 నుంచి రూ.50 వేల వరకూ వసూలు చేస్తాం. టాటూలపై యువతలో క్రేజ్ పెరిగింది.

– అనుబోయిన వెంకటేష్(ఏడుకొండలు), టాటూ సెంటర్ నిర్వాహకుడు, రాజమహేంద్రవరం

తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలు

కడియం: బుర్రిలంక వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబాజీపేట ప్రాంతానికి చెందిన తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. హైవేపై వెళుతున్న కారు, మోటారు బైక్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. స్థానికులు హుటాహుటీన వారిని ఆసుపత్రికి తరలించారు. కాగా.. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నలుగురి అరెస్టు

కడియం: బుర్రిలంకలో గాంబ్లింగ్ ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.4,470, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు కడియం పోలీసులు తెలిపారు. నిర్వాహకుడు పరారీలో ఉన్నాడని వివరించారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

కడియం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని దుళ్ల ఎస్సీ కాలనీలో ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. భారీ ఎత్తున యువతులు, మహిళలు ఈ పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని చాటారు. విజేతలకు విలువైన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తోకల శ్రీనివాసరావు, ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు, మాజీ సర్పంచ్‌లు దూడల నాగేశ్వరరావు, గుర్రపు సత్యనారాయణ (కొండయ్య మాస్టారు), మాజీ ఎంపీటీసీ టేకి శ్రీనివాసరావు తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఏటా ముగ్గుల పోటీ నిర్వహిస్తున్న ఎస్సీకాలనీ యువతను అభినందించారు.

న్యాయ సేవలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న డీఎస్ఎల్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: ఖైదీలు న్యాయ సేవలను వినియోగించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి అన్నారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం, మహిళా జైలును మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా ఖైదీలతో మాట్లాడారు. ప్రత్యేక మహిళా కారాగారాన్ని సందర్శించి అక్కడ ఖైదీలకు అందుతున్న వసతులను పరిశీలించారు. అనంతరం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి వారికి అవగాహన కల్పించారు. ఖైదీలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందిస్తున్న న్యాయసేవలను తెలిపారు. వీటిని ఖైదీలు వినియోగించుకునేందుకు వీలుగా జిల్లాలో కొత్తగా ప్రారంభమైన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్ కార్యాలయ వివరాలు తెలిపారు. కార్యాలయంలో నియమించిన ముగ్గురు న్యాయవాదులు ఖైదీలకు అవసరమైన న్యాయ సేవలను అందిస్తారన్నారు. కేసు విషయంలో వారి కుటుంబ సభ్యులు న్యాయ సంబంధిత సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. అనంతరం కౌన్సెలర్ లెనిన్ బాబు.. మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

వాల్తేరు వీరయ్యతో అసలైన సంక్రాంతి

సినీ ఎడిటర్ చోటా కె.ప్రసాద్


కుటుంబ సభ్యులతో ఎడిటర్ చోటా కె.ప్రసాద్

కడియం: వాల్తేరు వీరయ్య సినిమా ద్వారా అసలైన సంక్రాంతి జరుపుకొంటున్నానని కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన సినీ ఎడిటర్ చోటా కె.ప్రసాద్ తెలిపారు. ఆ సినిమాకు ఈయన ఎడిటర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆ సినిమా థియేటర్లలో అద్భుతమైన కలెక్షన్లు సాధించడంతో ప్రసాద్‌కు మంచి గుర్తింపు వచ్చింది. సంక్రాంతికి స్వగ్రామం వచ్చిన ప్రసాద్ స్థానిక విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి పండగకు ఏటా స్వగ్రామం వస్తానని, కానీ అసలైన సంక్రాంతి ఈ ఏడాది జరుపుకొంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు.

చోటా కె.నాయుడు సహకారంతో..

ప్రముఖ కెమెరామెన్లు చోటా కె.నాయుడు, శ్యామ్ కె.నాయుడు ఈయన బాబాయిలు. బాల్యం నుంచి చిరంజీవి అభిమాని అయిన ప్రసాద్ సినీరంగంలోకి రావాలనే కోరిక చోటా కె.నాయుడు అందించిన సహకారంతో నెరవేరింది. అంచలంచెలుగా ఎదుగుతూ ఎడిటర్‌గా స్థిరపడ్డారు. సినిమాలు ఫిలిం (రీల్స్) నుంచి డిజిటల్‌గా మారే సమయంలో ఈయన ఎడిటింగ్‌లో నైపుణ్యం సాధించారు. ప్రముఖ ఎడిటర్ గౌతమ్ రాజు వద్ద అసిస్టెంట్ ఎడిటర్‌గా ఎనిమిదేళ్లు పనిచేశారు. సుమారు 150 సినిమాలకు ఎడిటింగ్ షెడ్యూల్లో కీలక పాత్ర పోషించారు. అందులో ఎన్నో అద్భుత విజయాలు అందుకున్న సినిమాలే ఉన్నాయి. ఆ తర్వాత ఆయనకే ఎడిటింగ్ చేసే ఆకాశం వచ్చింది. ఇప్పటి వరకూ 36 సినిమాలకు ఎడిటర్‌గా వ్యవహరించారు. తాజాగా విడుదలైన వాల్తేరు వీరయ్య సినిమా ఎడిటింగ్‌లో ఇతను కనబరిచిన ప్రతిభ మెగాస్టార్ చిరంజీవితో పాటు సినీరంగ ప్రముఖులను ఆకర్షించింది. ప్రసాద్‌ను హీరో చిరంజీవి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఎడిటర్‌గా ఎక్కడకి పోతావు చిన్నవాడా, దువ్వాడ జగన్నాథం, గద్దలకొండ గణేష్, నాంది వంటి సినిమాలు మంచి గుర్తింపు ఇచ్చాయి. ప్రస్తుతం వాల్తేరు వీరయ్య సినిమాతో అందరి ఆదరాభిమానాలు అందుకుంటున్నారు. బంధుమిత్రులు అయన ఇంటికి దుళ్ల వచ్చి ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. అలాగే పలువురు ప్రజాప్రతినిధులు, చిరంజీవి అభిమానులు ప్రసాద్‌ను సత్కరిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


దుళ్ల హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కడియం: దుళ్ల ఉన్నత పాఠశాలలో 1995 – 2000లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు మంగళవారం కలుసుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను తలచుకుని సంతోషంగా గడిపారు. తమకు చదువు నేర్పిన గురువులను సత్కరించారు. దాదాపు మూడు నెలల పాటు కృషి చేసి తామంతా ఒక్కచోటుకు చేరేందుకు కృషిచేసిన మిత్ర బృందాన్ని సహచరులందరూ అభినందించారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు

రంగంపేట: మండలంలోని ఎస్టీరాజాపురంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు మంగళవారం అందజేశారు. స్థానిక సర్పంచ్ అడ్డాల పద్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు పాల్గొని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్‌తో కలసి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. మొదటి బహుమతి గెలుచుకున్న గొల్లపల్లి ఝాన్సీకి ఫ్రిజ్, రెండో బహుమతి గెలుపొందిన సుహాసినికి వాషింగ్ మిషన్, మూడో బహుమతి మేడిశెట్టి మోహనలక్ష్మికి గ్రైండర్ అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డాల వెంకటేష్, పప్పు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా మద్దతు ప్రకటించాలి


రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలుపుతున్న మధు, అరుణ్

ప్రకాశం నగర్: పేపర్‌మిల్లు కార్మికుల చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు పార్టీలకు అతీతంగా మద్దతు ప్రకటించి, కార్మికుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా పోరాడాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ పరంపర 2 ఆపాలని, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నా.. యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మధు మాట్లాడుతూ గుర్తింపు ఎన్నికలు వెంటనే జరగాలని, క్యాంటీన్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను సీనియార్టీ ప్రకారం పర్మినెంట్ చేయాలన్నారు. అనంతరం 8వ రోజు రిలే నిరాహార దీక్షలో కూర్చున్న కార్మికులకు మద్దతు ప్రకటించారు. సమావేశంలో ఐఎన్‌జీయూసీ దాసు, పేపర్‌మిల్ యూనియన్ నాయకులు రాజేష్ అప్పారావు, జీఏ రామారావు, వి.కొండలరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చెరలో రాజానగరం

- రోడ్లపైనే పార్కింగ్
- తరచూ ట్రాఫిక్ జామ్‌లు


రాజానగరం గాంధీబొమ్మ సెంటర్‌లో నిలిచిన వాహనాలు

రాజానగరం: నియోజకవర్గ కేంద్రమైన రాజానగరం ట్రాఫిక్ సమస్యతో కొట్టుమిట్టాడుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాహనాలు కూడా ఎక్కువైన నేపథ్యంలో రోడ్లు ఇరుకైపోయి, తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఇటు అన్నదాన సత్రం, అటు బస్టాండ్ వరకు నిత్యం ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటోంది. పాత ఎస్‌హెచ్ రోడ్డు విస్తరణ తక్కువగా ఉండటంతో పాటు ఇరువైపులా ఉన్న దుకాణాలు కూడా రోడ్డును ఆక్రమించాయి. ఆయా దుకాణాలకు వచ్చే కొనుగోలుదారుల వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీనితో బస్సులు, కార్లు వంటి ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా సాయంత్రం వేళలో రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది.

నిబంధనలు బేఖాతరు

ఇక్కడ లక్ష్మణరేఖగా ఉన్న మేజర్ సీసీ డ్రైనేజీని దాటి రోడ్డు పైకి రాకూడదనే నిబంధనలున్నాగానీ వాటిని వర్తకులు, కొనుగోలుదారులు ఖాతరు చేయడం లేదు. అసలే ఇరుకుగా ఉన్న రోడ్డు, ఆపై ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. అగ్నికి ఆజ్యం తోడైనట్టు ఆటోలను కూడా రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయడం కూడా సమస్య తీవ్రతకు మరో కారణంగా మారుతోంది. ఇటీవల గడ్డిలోడుతో ఉన్న ట్రాక్టర్ వెళ్లడంతో సమస్య తీవ్ర రూపం దాల్చింది. ఈ సందర్భంగా ఏర్పడిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు గంటన్నర సమయం పట్టింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మేజర్ సీసీ డ్రైనేజీని దాటి వ్యాపార లావాదేవీలు, వాహనాల పార్కింగ్ లేకుండా చేస్తే ట్రాఫిక్ సమస్య చాలావరకు పరిష్కారమవుతుందని ప్రయాణికులు చెబుతున్నారు.

ఆక్రమణల చెరలో..



రాజానగరంలో ఆక్రమణలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ప్రభుత్వ స్థలాలను తరచూ కబ్జా చేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. గ్రామంలోని ప్రధాన రోడ్డయిన పాత ఎస్‌హెచ్ పూర్తిగా ఆక్రమణల బారిన పడి ఇరుకైపోయింది.

– మోది సత్తిబాబు, రాజకీయ నాయకుడు

చర్యలు తీసుకోవాలి



వివిధ రకాల వ్యాపార లావాదేవీలకు గ్రామంలోని గాంధీ బొమ్మ సెంటర్ ఒక్కటే ప్రధాన కేంద్రంగా ఉంది. ఇటు హైస్కూలు, అటు సాయిబాబా గుడి సెంటర్ వైపు వ్యాపారాలను విస్తరిస్తే ట్రాఫిక్ సమస్య చాలావరకు తగ్గుతుంది. ఆటోలను కూడా బస్టాండ్‌లో రోడ్డుపై పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ వి.కనకరాజు, లెక్చరర్

గడియారానికి అందమైన ఆకృతి


చెక్కఫ్రేమ్‌లతో అందంగా రూపొందించిన గడియారాలు

రాజానగరం: వేకువజామునే నిద్ర లేవాలంటే అలారం పెట్టుకుంటాం. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే గోడనున్న గడియారాన్ని, ప్రయాణంలో చేతికున్న వాచీని చూసుకుంటూనే ఉంటాం. ఇలా మనిషి జీవితంలో ఒక భాగమైపోయిన గడియాన్ని ముఖ్యంగా గోడ గడియాన్ని అందమైన ఆకృతిలో అమరిస్తే ఎవరికి ఇష్టం ఉండదు. ఆ ఇష్టాన్నే తన వృత్తిగా చేసుకున్నాడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఫర్మాన్ (36) అనే యువకుడు. సహజంగా ప్రతి ఇంటిలోనూ గోడ గడియారాలు ఉంటాయి. అయితే ఆ గడియారాలను కత్తుల ఒర, గిటార్, ఈగల్, జింక, యాపిల్, చేతి వాచీ.. మున్నగు అనేక రూపాలలో చెక్కఫ్రేమ్‌లలో అమరిస్తే బాగుంటుంది కదూ. ఆ విధంగా ఆకట్టుకునే రూపాలతో రూపొందించిన గోడ గడియారాలను లాలాచెరువు వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై విక్రయిస్తున్నాడు. ఆకృతిని బట్టి రూ.600 నుంచి రూ.వెయ్యి వరకూ అమ్ముతున్నాడు.


యాపిల్ ఆకారంలో..


గిటార్ రూపంలో..